# శిథిలమైనా పట్టదా..?




శిథిలావస్థకు చేరిన శాంతినగర్ పశువైద్యశాల భవనం

- జిల్లాలో పశువైద్యశాలలు అధ్వానం
- వర్షాలు కురిస్తే గదుల్లో చేరుతున్న నీరు
- రిజిస్టర్లు, మందులు తడుస్తున్నాయని సిబ్బంది ఆవేదన



శిథిలావస్థలో జూలెకల్ సబ్‌సెంటర్

శాంతినగర్: రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే వ్యవసాయంతోపాటు అనుబంధమైన పశుసంపద అభివృద్ధి చెందాల్సి ఉంటుంది. వ్యవసాయంలో పశుసంపద వల్ల కలిగే లాభాలు అంతా ఇంతా కాదనే చెప్పవచ్చు. ఆర్గానిక్ ఎరువులతో పండించిన ధాన్యం తినగలిగితే రోగాల బారిన పడరనే నినాదాలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఆర్గానిక్ పంటలు పండించాలంటే పశుసంపద ఎక్కువగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పశువైద్యం గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

**జిల్లాలో పశు వైద్యశాలలు ఇలా..**

జిల్లాలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 2 ఏవీహెచ్‌లు, 19 ప్రైమరీ వెటర్నరీ సెంటర్లు, 25 సబ్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో సుమారు 6 వరకు శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల కాలంగా వాటి గురించి కనీసం మరమ్మతులు చేయడానికి అధికారులకు మనసు ఒప్పడంలేదంటే వారికే తెలియాలని పలువురు ఆరోపిస్తున్నారు.

**దయనీయంగా వైద్యశాలలు**

శాంతినగర్, రాజోళి, జూలెకల్, బిజ్వారం సబ్ సెంటర్లు మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సెంటర్ల వద్దకు వెళ్తే ఆసుపత్రా లేక బందెల దొడ్డా అనే అనుమానం కలుగుతుందని చెబుతున్నారు.

### భయంతో సిబ్బంది విధులు

పైకప్పులు పెచ్చులూడుతుండటంతో భయంతో విధులు నిర్వహిస్తున్నామని శాంతినగర్, రాజోళి, జూలెకల్ సబ్‌సెంటర్ల సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. శాంతినగర్‌లో గతంలో పెచ్చులూడి సిబ్బంది గాయాలపాలయ్యారు. సెంటర్‌లో విధులు నిర్వహించాలంటే భయంగా ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు.

**సరైన సిబ్బంది లేక..**

ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది సరిగా లేక వైద్య సదుపాయాలు పూర్తిస్థాయిలో అందడంలేదని పశువులు, గొర్రెల, మేకల యజమానులు ఆవేదన చెందుతున్నారు. పశువులు, జీవాలకు అత్యవసర పరిస్థితులు వస్తే వైద్యులు అందుబాటులోలేక మృత్యువాత పడుతున్నాయని వాపోతున్నారు. ప్రైవేట్‌గా వైద్యం చేయించుకుంటూ రూ.వేలకు వేలు నష్టపోతున్నామని చెబుతున్నారు.

**ప్రైవేటు మెడికల్ షాపులకు**

పశువులకు వ్యాధులు సంభవిస్తే ప్రభుత్వ దవాఖానాలకు వెళ్తే అక్కడ మందులు లేవని ప్రైవేట్ మెడికల్ షాపులకు చిట్టీలు రాస్తున్నారని జీవాల పోషకులు ఆవేదన చెందుతున్నారు. వందలు, వేలు పెట్టి మందులు తెచ్చి పశువులు, జీవాలను బ్రతికించుకుంటున్నామని వాపోతున్నారు.

### విధులకు వెళ్లాలంటే భయం



శాంతినగర్‌లోని ప్రైమరీ వెటర్నరీ సెంటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడుతోంది. వర్షాకాలంలో నీళ్లు కారుతుంటాయి. అప్పుడప్పుడు పెచ్చులు పడుతుంటాయి. ఆస్పత్రిలో ఉండాలంటే భయంగా ఉంటుంది.

– డాక్టర్ పుష్పలత, వెటర్నరీ సెంటర్, శాంతినగర్

### సగం పడిపోయింది



జూలెకల్‌లోని పశువుల ఆస్పత్రి సగం పడిపోయింది. మిగతా గది ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి. ఒక్కరే సిబ్బంది వస్తుంటారు. సెంటర్‌లోకి వెళ్లకుండా బయటనే వైద్యం చేసి వెళ్తుంటారు. మందులు శాంతినగర్‌కు వెళ్లి తెచ్చుకోవాలి. కొత్త భవనం నిర్మించి వైద్యులు, మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

– శేఖర్, రైతు, జూలెకల్

### ప్రతిపాదనలు పంపాం

జిల్లాలో శిథిలావస్థకు చేరిన బిజ్వారం, రాజోళి, జూలెకల్ సబ్ సెంటర్లు, శాంతినగర్‌లోని ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌లకు మొత్తం 8 కొత్త భవనాలు మంజూరు చేయాలని పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి వచ్చే మందులను సెంటర్ల వారీగా పంపుతున్నాం. తక్కువ బడిన సమయంలో బయట తెచ్చుకోవాల్సి ఉంటుంది. అంతేగాక 18 మంది డాక్టర్లు ఉండాలి. 6 మంది మాత్రమే ఉన్నారు. అటెండర్లు తక్కువగా ఉన్నారు. వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నాం. త్వరలో సిబ్బంది వచ్చే అవకాశం ఉంది. నిధులు మంజూరైన వెంటనే భవనాలు నిర్మించి ఇబ్బందులు తొలగిస్తాం.

– వెంకటేశ్వర్లు, పసుసంవర్ధకశాఖ అధికారి, జోగుళాంబ గద్వాల

### పెచ్చులూడుతున్న భవనాలు

శాంతినగర్ ప్రైమరీ వెటర్నరీ సెంటర్ శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతోంది. వర్షాకాలంలో వర్షపు నీరు గొడలు, భవనంలోకి చేరి రిజిస్టర్లు, పరికరాలు తుప్పుపడుతున్నాయి. రాజోళి, జూలెకల్, బిజ్వారంలో ఏర్పాటు చేసిన సబ్ సెంటర్లు పైకప్పులు పడిపోయాయి. శాంతినగర్ ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌లో పరికరాలు, మందులు పెట్టుకోడానికి అవకాశం లేకుండా పోయిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరికరాలు అన్నీ తుప్పుపట్టిపోయావని, ఫైళ్లు, మాత్రలు తడిచిపోతున్నాయని వాపోతున్నారు.



శాంతినగర్‌లో పైకప్పు పెచ్చులూడిన భవనం

## క్లుప్తంగా

### నోటిఫికేషన్ విడుదల



మానవపాడు: మండలంలోని ఆయా పంచాయతీల వద్ద కార్యదర్శులు ఎన్నికల నోటిఫికేషన్ నోటీస్‌బోర్డులో ఏర్పాటు చేశారని ఎంపీడీఓ రమణరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్‌ను నోటీస్‌బోర్డులో ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడారు. రెవెన్యూ డివిజినల్ అధికారి ఆదేశానుసారం మండల పరిషత్ కార్యాలయాల్లో, అలంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ చేస్తున్నట్లు తెలిపారు.

### మాదిగ విశ్వరూప సభకు తరలిరండి



కేటీదొడ్డి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ 11న హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జంబయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనుబంధ సంఘాల నాయకులు, మాదిగ ఉపకులాలు, మండల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాశప్ప, నర్సింహులు,హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుడికి సన్మానం



అయిజ: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పట్టణానికి చెందిన ఫిరోజ్‌ను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పట్టణంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కావడానికి నిరంతరం కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో శాలి పైల్వాన్, బాషు, షబ్బీర్, రహీం, షఫీ, పరశురాముడు, యాకోబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరికలు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వెంకటోముపల్లి, కొత్తపాలెం, మద్దెలబండ, గార్లపాడు, మాచర్ల, గుంటిపల్లి, జిల్లా కేంద్రంలోని 11, 26వ వార్డులకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి జెడ్పీచైర్‌పర్సన్, కాంగ్రెస్ అభ్యర్థి సరిత కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో డీసీఎం అసోషియేషన్ సభ్యులతో కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

### టీబీ రోగులకు మందుల పంపిణీ

రాజోళి: టీబీ నిర్ధారణ అయిన వారికి మెడికల్ ఆఫీసర్ మధుబాబు శుక్రవారం మందులు పంపిణీ చేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మానసికంగా ధైర్యంగా ఉండాలని సూచించారు. వైద్య సలహాలు తప్పక పాటించాలని అన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి, వేముల పంచాయతీలను శుక్రవారం ఎంపీడీఓ రాఘవ సందర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తాగునీరు, విద్యుత్ ఇతర వాటిని పరిశీలించి సరైన వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం వేములలో నర్సరీని పరిశీలించి బ్యాగులలో మట్టిని సకాలంలో నింపాలని కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు నరేష్, అరుణ తదితరులు ఉన్నారు.

మానవపాడు: మండలంలోని జల్లాపురం ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ సిరాజుద్దీన్

మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ సిరాజుద్దీన్ పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ.. పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. తరగతి గదులను పరిశీలించారు. కొత్తగా నిర్మించిన గదులను పరిశీలించి సూచనలు ఇచ్చారు. స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని సూచించారు.

## ఆలయంలో బీజేపీ అభ్యర్థి ప్రత్యేక పూజలు

ధరూరు: పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ గద్వాల అసెంబ్లీ అభ్యర్థి బలిగెర శివారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. గద్వాల నుంచి బలిగెర శివారెడ్డికి టికెట్ కేటాయించడంతో వారు శుక్రవారం సాయంత్రం ఆలయంలో పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు చక్రపాణి జోషి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, ప్రకాష్‌రావు, రామాంజనేయులు, రాముడు, హన్మంతరాయ, పాండు, శ్రీపాదరెడ్డి తదిరులు పాల్గొన్నారు.



ఆలయంలో డీకే అరుణ, అభ్యర్థి బలిగెర శివారెడ్డి

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



అలంపూర్‌చౌరస్తాలో ఏడీఈకి దరఖాస్తు అందజేస్తున్న రైతులు



అయిజలో విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న ఏడీఈ గోవిందు

అలంపూర్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి తమ శాఖ నిరంతరం పని చేస్తుందని ఏడీఈ చిన్న మక్బుల్ తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని ఏడీఈ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఈ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదుగురు రైతులు ఇటీవలే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకోవడంతో త్వరగా మంజూరు చేయాలన్నారు. ఏడీఈ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్‌లు త్వరగా వచ్చే విధంగా చూస్తామన్నారు. రైతులు విద్యుత్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ వినియోగ సామగ్రి, ఉపకరణాలను జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. సమస్యలు వస్తే నేరుగా రైతులు మరమ్మతు కోసం వెళ్లొద్దన్నారు. విద్యుత్ అధికారులు, తమ శాఖకు సంబంధించిన సిబ్బందితోనే మరమ్మతు చేయించుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై రైతులు, వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు సత్తార్ బాష, సుబ్బరాయుడు, శివకుమార్, శ్రీధర్, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

అయిజ: విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏడీఈ గోవిందు అన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఈడీఈ కార్యాలయం వద్ద అయిజ, గట్టు, మల్దకల్, రాజోళి మండలాల ఏఈలతో కలిసి సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. త్వరలో సమస్యలను పరిష్కారం చేస్తామని ఆయా మండలాల విద్యుత్ వినియోగదారులకు తెలిపారు. అయిజ ఏఈ నరేందర్ రెడ్డి, గట్టు ఏఈ చిన్నయ్య, మల్దకల్ ఏఈ దుర్గ ప్రసాద్, అకౌంట్ ఆఫీసర్ రహీం తదితరులు పాల్గొన్నారు.

### యువతి అదృశ్యం

శాంతినగర్: ఓ యువతి అదృశ్యమైన ఘటన వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా.. శాంతినగర్‌కు చెందిన టీ.దేవిబాయి గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో యువతి తల్లి రుక్మిణిబాయి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఆత్మగౌరవమే మా ధ్యేయం



శాంతినగర్: రాష్ట్రంలో ఆత్మగౌరవమే ధ్యేయంగా ఎన్నికల్లో పాల్గొంటున్నామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అలంపూర్ నియోజకవర్గంలో నీలి జెండా తప్ప ఏ జెండా ఎగురనివ్వమన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడిన బీఆర్‌ఎస్‌ను గద్దె దించుదామని పిలుపునిచ్చారు. గతంలో ఎన్నో పార్టీలకు ఓట్లు వేసినా మన జీవితాలు మారలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటేద్దాం మన జీవితాలను మార్చుకుందామన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఏ వార్డుకు వెళ్లినా సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. అధికార దాహంతో కమీషన్ల కోసం పనులు చేస్తున్నారే తప్పా, అభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. ఎన్నికల అనంతరం బహుజన సమాజ్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి పేదవాడికి అండగా ఉంటుందన్నారు. సమావేశంలో సుధా, రాంప్రసాద్‌రెడ్డి, మహేష్, తిరుపాల్, కనకం బాబు, రవిచంద్ర, నాగేశ్వర్ రెడ్డి, శాంతకుమార్, రవి పాల్గొన్నారు.

## కేసీఆర్‌తోనే అన్ని విధాలుగా అభివృద్ధి



తాటికుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలరూరల్/ధరూర్/మల్దకల్: కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు మోసపోవద్దు ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తాటికుంట, శేషంపల్లి, చర్లగార్లపాడు, మద్దెలబండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు కలిగిందన్నారు. కార్యక్రమంలో స్టేట్ కన్జ్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధిని చూసి ఓటెయ్యండి**

పదేళ్లలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తనయుడు సాయి సాకేత్‌రెడ్డి అన్నారు. పల్లె పలకరింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని జాంపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రకటించిన పథకాల కరపత్రాలను పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిల సమక్షంలో విడుదల చేశారు.

**మరోసారి గెలిపించండి**

మరోసారి నన్ను, సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని సంగాల వద్దనున్న గుత్తిబైబిల్ మిషన్ ఆధ్వర్యంలో చర్చిలో పాస్టర్ అద్భుతకుమార్ ప్రార్థన చేశారు. కార్యక్రమంలో రామన్న, పూడూరు చిన్నయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

కేటీదొడ్డి: ఈ నెల 6న గద్వాలలో నిర్వహించే ప్రజా ఆశీర్వద సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రాజశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చింతలకుంటలో పోస్టర్ విడుదల చేశారు. గద్వాలలోని మార్కెట్ యార్డు వెనుక నిర్వహించే సభకు మండల ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గోవిందురెడ్డి, రఘుకుమార్‌శెట్టి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గట్టు: గద్వాలలో 6న నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, సర్పంచ్ హనుమంతునాయుడు కోరారు. శుక్రవారం ఆలూరు, రాయాపురం, పెంచికలపాడులో బీఆర్ఎస్ నాయకులు పర్యటించి, పోస్టర్లను విడుదల చేశారు.



సభ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

## నందిన్నె చెక్‌పోస్టు వద్ద తనిఖీలు



నందిన్నెలో తనిఖీ చేస్తున్న పోలీసులు



అయిజలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కేటీదొడ్డి: ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెక్‌పోస్ట్ సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు, బంగారం తీసుకెళ్లే వారు రశీదులు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేని నగదు, బంగారాన్ని సీజ్ చేస్తామని తెలిపారు.

అయిజ: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలీసులు శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎస్ఐ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో రాయచూర్-కర్నూల్-గద్వాల టీ రోడ్డులో తనిఖీ చేపట్టారు. అదేవిధంగా ఉత్తనూరు- రాయచూరు- కర్నూలు టీ రోడ్డులో అనంతరం కర్నూలు- ఉప్పల- అయిజ టీ రోడ్లలో కార్లు, జీపులు, ఆటోలు, బస్‌లను పోలీసులు తనిఖీ చేశారు. భూంపురం చెందిన వ్యక్తి అక్రమంగా ఐదు లీటర్ల మద్యాన్ని తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## మద్యం నిల్వ చేస్తే కఠిన చర్యలు

మానవపాడు: ఎన్నికల వేళ అక్రమంగా మద్యం నిల్వ చేసినా, తరలించినా కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ రాము హెచ్చరించారు. శుక్రవారం తనిఖీల్లో భాగంగా మండల పోలీసులు నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో 195.34 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం వారు తెలిపారు. మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో లిక్కర్ డంపులు చేపట్టారని సమాచారం రావడంతో లచ్చగౌడ్ ఇంటిలో తనిఖీలు చేపట్టగా 88.91 లీటర్ల మద్యం (రూ.75,153 విలువ), అదే గ్రామానికి చెందిన మద్దిలేటి గౌడ్ ఇంట్లో 106.43 లీటర్ల మద్యం (విలువ రూ.74,535) పట్టుబడినట్లు ఎస్ఐ వివరించారు. మద్యం కాటన్లను స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మొత్తం 195.34 లీటర్ల మద్యం సీజ్‌చేయగా వాటి విలువ రూ.1,49,688 ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా పరిధిలో ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్లరాదని, డబ్బుకు చెందిన రశీదు, తగిన ధ్రువపత్రాలు వారి వెంట ఉంటే తీసుకెళ్లవచ్చన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకువెళ్లరాదని ఎస్పీ రితిరాజ్ ఆదేశించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

**మద్యం నిల్వలపై సమాచారం ఇవ్వండి**

గద్వాల క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పెద్ద మొత్తంలో మద్యం నిల్వ చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం ఉందని ఎక్సైజ్ సీఐ గోపాల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో అనుమతి లేని మద్యం సరఫరా చేసే అవకాశం ఉందని, ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2523కి సమాచారం అందించాలని కోరారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని వెరిట్ యాప్ ద్వారా గుర్తించాలని తెలిపారు.



పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన మద్యం కాటన్లు

**మద్యం పట్టివేత**

ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ హాల్ట్, అలంపూర్ చౌరస్తా దారిలో ఆటోలో మద్యం తరలిస్తున్న ఈడిగ పరమేశ్వర్‌గౌడ్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. శుక్రవారం మద్యం దుకాణం నుంచి రూ.9,504 విలువ చేసే మద్యం కొనుగోలు చేసి ఆటోలో కర్నూల్‌కు తరలిస్తుండగా సీజ్ చేసి ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## శబరిమలకు అద్దెకు ఆర్టీసీ బస్సులు

గద్వాల క్రైం: శబరిమల వెళ్లేందుకు ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు డీఎం మంజులరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక రాయితీల ద్వారా బస్సులను అద్దెకు ఇచ్చేందుకు సంస్థ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ వాహనాల కంటే ప్రభుత్వ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఈ అవకాశం భక్తులు సద్వినియోగం చేసుకోవాలని, బస్సును బుక్ చేసుకున్న వారికి బస్సులో ఐదుగురికి ఉచిత ప్రయాణంతో పాటు రూ.300 ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు డిపో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

## జీవాలకు పీపీఆర్ టీకాలు



వడ్డేపల్లిలో గొర్రెలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

అయిజ: గొర్రెలు, మేకలకు పారుడు రోగం రాకుండా ఉండేందుకు మండలంలోని వివిధ గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది టీకాలు వేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. శుక్రవారం మండలంలోని రాజాపురం, పర్దిపురంలో వెటర్నరీ సిబ్బంది గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. మొత్తం 1,820 గొర్రెలకు, 144 మేకలకు టీకాలు వేసినట్లు తెలిపారు. గొర్రెలు, మేకల యజమానులు మూగజీవాలకు టీకాలను తప్పనిసరిగా వేయించాలని కోరారు.

**టీకాలు తప్పనిసరిగా వేయించండి**

శాంతినగర్: గొర్రెలు, మేకలకు పారుడు రోగ నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని డాక్టర్ పుష్పలత తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని కోయిల్‌దిన్నెలో గొర్రెలు, మేకలకు శుక్రవారం పారుడు రోగ నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ లతీఫ్, సిబ్బంది రవి, కృష్ణ, వెంకటమ్మ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగుళాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com